పెద్దలు

గోపరాజు రాజన్న

౧

పల్లెటూరికాపురం. పట్నవాసం అని పేరు వినడమేగాని కోశెడుదూరంలో ఉన్న కసింకోటయినా యెరగదు పెద్దమ్మాయి. పాడి, పంట, పిల్లల్నీ సవరించుకోవడంతో పొద్దుపోయేది పెద్దమ్మాయికి. వేమయ్య చెప్పినది వేదవాక్యం అన్నట్టు అత్త యెంత చెబితే అంత. పొద్దల్లా దుక్కి దున్ని, గడ్డి పరక మోపు నెత్తిమీద పెట్టుకొని మగడు గడప యెక్కుతూఉంటే గడగడలాడుతూ, కూర్చునిఉన్న పెద్దమ్మాయి పమిటె సవరించుకొని లేచి నిలవపడేది. ముఖంయెదుట పడి 'నాకీ చీర కావాలి' అనిఐనా అడిగియెరుగదు మొగుడ్ని.



“ఇంకా సిగ్గేమిటే బిడ్డతల్లివయినతరువాత?”

పెద్దమ్మాయిభర్త గోపాలం. అత్త పెద్దమ్మ. నూటనాటికి ఒక్కడే కొడుకుకావడంచేత పెద్దమ్మ గోపాలాన్ని యెంతో గారాబంగా పెంచింది. పెద్దమ్మాయి ఎనిమిదేసంవత్సరాల పిల్లయిఉండగా గోపాలానికి పెళ్లిచేసింది. కొడుకుకార్యం చూచింది. కోడలు కనడం చూచింది. మనుమడిని ముద్దాడింది. పెద్దమ్మకు నూట్లోపడి దగ్గరపడుతున్నాది. కొడుకూ, కోడలూ చల్లగా ఉండగా నాఘటం వెళ్లిపోతే అంతే చాలు అని అనుకున్నది.

ఆరోజు దసరా దశమి. పుచ్చపువ్వులాగ వెన్నెల కాస్తున్నది. వాకిటిలో చాపలు వేసికొని భోజనానంతరం కుటుంబసహితంగా సభ కావించింది పెద్దమ్మ. గడ్డిమేటుదగ్గర యెడ్లుకూడా పండుగవేడుక తెలియచేస్తూ తలలాడిస్తూ స్వేచ్ఛగా మేస్తూఉన్నవి. పెద్దమ్మాయిమాత్రం శోభనపుపెళ్లికూతురులాగ దూరంగా నిలవపడిఉన్నది. 'పెద్దమ్మాయీ' అని పిలిచి, 'ఇంకా సిగ్గేమిటే, బిడ్డతల్లివయినతర్వాత? ఇలా వొచ్చి కూర్చో' అన్నది పెద్దమ్మ. కొత్తవీణధ్వనివలె జంకుతూజంకుతూ అత్తదగ్గరకువచ్చి కూర్చున్నది కోడలు. 'అమ్మాయీ' అని పెద్దమ్మ యిలా అన్నది: 'నేనెంతోకాలం బతకను తల్లీ. ఇల్లూ, సంసారం నీ నెత్తిమీద వదలివేస్తున్నా. ....పెద్దలులేని యిల్లు వృథావృథా ...కాని...'అని యేమో చెప్పబోతూఉంటే పెద్దమ్మాయి, 'అత్తయ్యా, పెద్దలు లేకపోతే ఏం చెయ్యాలి?' అన్నది.

'పెద్దలు లేకపోతే ఎద్దుబుఱ్ఱయినా తెచ్చిపెట్టుకోవాలి.'

౨

'ఒసేవ్, చూసావుటే. పెద్దమ్మాయి కొత్తగా దుద్దులు చేయించుకుంది. అత్తపోతే కోడలుకి ఆర్భాటం యెక్కువవుతుంది.'

'అవి దుద్దులుగావు నక్షత్రాలు'.

'అబ్బే! దుద్దులు జబ్బుదుద్దులట. నీకింకా తెలియదు కాబోలు!'

'........................'

'........................'

ఈరీతిగా ప్రసంగిస్తూ సూర్యాకాంతం, సత్యవతి యేటిలో జలకమాడుతూ, బిందెపట్టుకువస్తూ ఉన్న పెద్దమ్మాయిమీద ఊసులు పెట్టుకున్నారు. తూర్పుకనుమలద్వారా ప్రవహిస్తూ అనాదినుండీ పెద్దల అగ్రహారానికి సర్వకాలసర్వావస్థలయందూ పసిబిడ్డ బాలాదికీ నీటివసతి కలుగచేసే యేరు. పూర్వకాలం నుంచీ అగ్రహారం పెద్దలఅగ్రహారమనీ, యేరు పెద్దల యేరనీ పిలువబడుతూ ఉన్నవి. ఏటికి స్నానానికివచ్చి అగ్రహారపు అమ్మలక్కలు చాలాసేపు కబుర్లతో, కథలతో అగ్రహారపుభోగట్టాలతో కాలంపుచ్చి సావకాశంగా యింటికి వెళ్లేవారు.

సూర్యాకాంతం, సత్యవతీ కొత్తకోడళ్లు. పట్నవాసపు పిల్లలు. పెద్దమ్మాయి ఏటిఒడ్డుకు రాగానే పక్కన నవ్వారు. చంకలో ఉన్న పిల్లవాడిని ఒడ్డుని కూర్చుండబెట్టి, పెద్దమ్మాయి పట్టుతివాసీమీద నడచినట్టుగా యేటిలోకి వెళ్లింది. తెరతెరలుగా ప్రవహిస్తూ ఉన్న యేరు ఆముగ్గురు ఇంతులతో గేలిచేస్తూ, చీర కొంగులు లాగికొని పోతూఉంటే, వానిని సవరించుకొంటూ యువతులు ఇచ్ఛావిలాసంగా జలకమాడుతూ ఉన్నారు. ముఖానికి పసుపుపూసి పెద్దమ్మాయి దోసెడునీళ్లు తీసికొని ముఖంమీద జారవిడిచింది. 'పెద్దమ్మాయివదినా' అని సూర్యాకాంతం యేమో చెప్పబోతూ బుడుంగున నీటిలో మునిగి క్షణంలో లేచి యిలా అంది:

'అత్తయ్యా మాసికాలు అయిపోయినట్టేనా?'

పెద్ద:—ఆ! నిన్ననే ఆఖరిమాసికం. పెద్దదిక్కుపోయింది. ఇంట్లో ఒక్కర్తెని.

సూర్యాకాంతం:—పోయేటప్పుడు—

కూర్చున్న సత్యవతి ప్రవాహానికి సాగుతూఉన్న తనబిందెను పట్టుకొని బుడుంగున యేటిలో ముంచి, బిందె తీసి బుజంమీద పెట్టుకొని చీరపట్టుకు వేళ్లాడుతూఉన్న యేటిని విదలించుకొని, ఒడ్డెక్కి, 'సూర్యాకాంతం, మీఅన్నయ్య ఇంటికి వచ్చేవేళ అయింది. పోతున్నా' అని సెలవుతీసికొని యింటికి సాగింది. 'అత్తయ్య చనిపోయేముందు యేంచెప్పారు వదినా?'

"అత్తయ్య చనిపోయేముందు......ప్రశ్నించింది."

అని సూర్యాకాంతం పెద్దమ్మాయిని ప్రశ్నించింది. జారిపోతూఉన్న పమిటె సవరించుకొని 'పెద్దలులేని యిల్లు వృథా, వృథా! పెద్దలు లేకపోతే ఎద్దుబుఱ్ఱయినా తెచ్చిపెట్టుకోవాలి అని' అన్నది పెద్దమ్మాయి.

సూర్యా:—పెద్దవాళ్లతో ఉన్న చిక్కల్లా యిదే. ప్రపంచకం అంతా వాళ్లతోటే ఉందన్నట్టు మాటాడుతారు. చిన్నవాళ్లు మట్టిగొట్టుకుపోయినా పరవాలేదన్నట్టు.

పెద్ద:—సూర్యాకాంతం, మా అత్తయ్య అలాగనే మనిషి కాదు. చిన్నదానినైనా ప్రతీవ్యవహారంలో నామాట పాటిస్తూ ఉండేది.

ఎంతవాళ్లనైనా హేళనచెయ్యడం సూర్యాకాంతపు స్వభావం. పెద్దమ్మాయి అమాయకురాలని, ఆమెను ఆడించవలెనని అనుకుంది. ఎంతో వినయంతో యిలా ప్రారంభించింది:

'ఔను వదినా, పెద్దదిక్కు పోయింది. ఇప్పుడేం చెయ్యదల్చుకున్నావ్?'

* * * *

'ఎద్దుబుజ్జి'

'తెచ్చిపెట్టుకోవాలి' అని పెద్దమ్మాయి భక్తిశ్రద్ధలు స్ఫురించేటట్టు అంది. 'దేవుడుగదిలో మహాలక్ష్మీపీటలో పెట్టి పూజించాలిసుమీ. మనఊరుకి ఎలుకలవాళ్లు పెద్దల నమ్మ నూపుతారు. వచ్చే యేకాదశినాడు ఎలుకలమ్మ వస్తుంది. మీయింటికి పంపుతానులే.'

'ఆ పెద్దలు యెద్దుబుజ్జిలేనా?'

'ఆ! ఎద్దుబుజ్జిలే. అవి కొంచెం వికృతంగా కనపడతాయి. చీకటిలో వాటిని చూస్తే పెద్దపులులవలె కనపడతవి.'

'అయితే ఇద్దరు పెద్దలని కొంటానే.'

3

వరివెన్నులు జీమూతవాయిద్యానికి తలలూపుతూ నిత్యానందంగా ఉన్నాయి. పెద్దయేటికి పడమరగా ఉన్న పొలం క్రొత్తగా చాలుపట్టిఉన్నది. పొలంగట్టుమీద యిద్దరు నారీమణులు కూర్చునిఉన్నారు. పొలములోని యెఱ్ఱరాగిడిచాలు ప్రేమాంగనయొక్క పెదిమెలవలె ఉంది. ఇద్దఱు నారీమణులు ఒకఅరగంట కాలం గుసగుసలాడారు. పిదప అందొక యువతి:

'ఐతే, పెద్దమ్మాయిఇంటికి ప్రయాణం యెప్పుడు సూర్యాకాంతం?'

'వారంరోజులలో. ఎలుకలమ్మ వస్తుందిఅని చెప్పి ఉంచాను. సత్యవతీ, నీపాత్ర చాకచక్యంగా ధరించాలిసుమా.'

'అయ్యో, అలాగే. ఎంతకైనా తగుదువే సూర్యాకాంతం. మంచిగమ్మత్తే పన్నావు.'

౪

శ్రావణశుక్రవారం. ఇల్లలికి, ముగ్గులుపెట్టి, మహాలక్ష్మీపీటను శృంగారించి, పిండివంటల్తోసహా మహాలక్ష్మికి నైవేద్యం సమర్పించింది పెద్దమ్మాయి. భోజనాలయినతర్వాత వంటిల్లు చక్కబెట్టి, వీథిచావడిలోకి వచ్చి నడుంవాల్చింది. క్షణంలో తెలివిలేకుండా నిద్రపోయింది. ముఖం మంచిముత్యాలతో నింపినట్లుగా ముచ్చెమటలు పోసింది. ఎడపిల్లడు చన్నుకుడవడానికని తల్లిప్రక్కలోకి వచ్చి, అలాగ్గానే నిద్రపోయాడు. గాఢనిద్రలో ఉన్న పిల్లవాడు కళ్లువిప్పి, మళ్లీ మూసి, తల్లిప్రక్కలో చొరుచుకుని మరీ నిద్రపోయాడు. పెద్దమ్మాయి కొంచెం కదలి పిల్లవాడిని మరింతదగ్గరగా తీసికొని చల్లగా వీస్తూఉన్న పిల్లగాలికి ఆరీఆరని కురులు ముఖంమీది ముత్యాలతో ఆడుకుంటూంటేకూడా లేవలేదు. వాకిట్లో గణగణమని గంటలు మ్రోగిస్తూ, పంటలక్ష్మియొక్క జయభేరీవినండోయి అన్నట్టు, పొలాల్నుంచి యెడ్లు దొడ్లల్లో పడుతున్నాయి. గోపాలం గడపెక్కాడు. భార్య యెదురుగా రాలేదేమని సంకోచిస్తూ సావిట్లోకి వచ్చాడు. నిద్రాసుఖాన్ని అనుభవిస్తూఉన్న తల్లీపిల్లల్ని చూసాడు. తొలకరిలో గడ్డిపరకవలె ఆనందంపొందాడు. 'అమ్మాయీ' అని భార్యను పిలవబోయి, మళ్లీ ఊరుకొని వింటికి యెక్కుబెట్టిన బాణంలాగ నిలుచుండిపోయాడు. పెద్దమ్మాయి కొంచెం వత్తిగిలి 'పెద్దలా! పెద్దలా!' అని కలవరించింది. నిట్టూర్పువిడిచి భార్యచెంత కూర్చు

న్నాడు గోపాలం. కురులను సవరిస్తూ 'అమ్మడూ' అని భార్యను లేపాడు. 'ఎవరు వారు?' అని ఉలిక్కిపడి లేచి, పెద్దమ్మాయి భర్తను చూచి యేమో చెప్పబోయి, చెయ్యి పట్టుకుని, వాకిట్లో తులసికోటదగ్గరకు తీసుకు వచ్చింది.

"చెయ్యిపట్టుకుని, వాకిట్లో......తీసుకువచ్చింది."

'పాదుకల' అంది పెద్దమ్మాయి.

'ఏమికల?'

'ఘంటసేపటినుంచి పాదుకల ఒకటి నామన సులో చొరుచుకుకొని ఉంది. అంతా చెప్పలేను కాని......పెద్దల నమ్మతెచ్చిందిట యెఱుకలమ్మి. ఆపెద్దల్ని కొని పసుపురాసి బొట్టుపెట్టానట. ఆవాళ రాత్రే దొంగలు పడ్డారట.........ఎంతోభయం వేసిందిసుమండీ! ఒళ్లు ఝల్లుమంటున్నాది.........'

'తర్వాత?'

'భయమేస్తున్నాది......పెద్దలు పెద్దపులు లై పోయారట. గాండ్రుగాండ్రుమని అరచేటప్పటికి దొంగ లెక్కడవాళ్లక్కడ పారిపోయారట'

'తర్వాత?'

'పిల్లలూ, నేనూ యేమైపోయామో అని ఊరంతా వెతుకుతారట మీరు.'

'తర్వాత?'

'కాని యెక్కడా కనిపించము...ఇంతట్లో తెల్లవారిపోతుందట...ఊరంతా వెతికి యింటికి వస్తారట...ఇంట్లో పిల్లల్నీ, నన్నూ చూసి పరమానందం పొందుతారట.'

'తర్వాత?'

'ఇంతట్లో మెలకువొచ్చింది.'

'మరేం భయంలేదు అమ్మడూ' అని భార్యను ఊరడించాడు భర్త.

✂

సూర్యాకాంతం పదునెనిమిదివత్సరముల యువతి. తెనుగులో పాండిత్యం కొంత సంపాదించింది. తలిదండ్రులు విద్యాభిలాషులుకావడంవల్ల కూతుర్ని ఆంగ్లేయంలోకూడా పోర్లించారు. కాని ఆ అమ్మాయికి ఆంగ్లేయపుముక్క లేమీ అంటలేదు. తెనుగుపుస్తకం అర్థంచేసుకోవడమంటే సూర్యాకాంతానికి మంచినీళ్లు తాగినట్టే. చిన్నప్పటినుంచీ పట్నవాసంలో పెరగడం చేత పల్లెటూరిప్రజలంటే వట్టి యెద్దుమొద్దుస్వరూపాలని ఆ అమ్మాయిఅభిప్రాయం. అత్తారిఊరు పట్నవాసమే కావాలనికూడా చిన్నప్పటినుంచీ భగవంతుడికి మ్రొక్కుతూఉండేది. కాని తా నొకటితలిస్తే దైవమొకటి తలచాడు.

అగ్రహారపు ఆడవాళ్లంటే సూర్యాకాంతానికి పండుగ. ఎందుకు? వేళాకోళంచెయ్యడానికి. సరసం విరసంలోకి మారేది అప్పుడప్పుడు. మగాళ్లు మగాళ్లు కూడా జుత్తులుపట్టుకోవడం సంభవిస్తూఉండేది. ఉడుకున్నవాళ్లని ఉడికించడం మరీ సరదా సూర్యాకాంతానికి. గోపాలాన్ని తప్పించి పెద్దలఅగ్రహారంలో సుందర

స్వరూపుడు సూర్యాకాంతంభర్త ఒక్కడే. సత్యవతిభర్త చామనచాయగలవాడు.

ఒకనాడు అగ్రహారపు అమ్మలక్కలంతా సూర్యాకాంతంయింట్లో సభకావించారు. నవ్వుతూ, సూర్యాకాంతం అందర్లోనూ నిల్చుని, 'సత్యవతీ, గమ్మత్తు!' అంది. సత్యవతి అప్పుడే గుమ్మం యెక్కుతున్నది. ఆగినది.

'ఏమిటే చెప్పవూ?' అంది సత్యవతి.

'ఆగమ్మత్తు నీకు తెలుసునే.'

'అబ్బ, చెప్పవే!'

'నీకు వక్కర్తికే తెలుసునే. ఇంక యెవ్వరికీ తెలియదు.'

'మరింతేగా సూర్యాకాంతం, చెప్పమంటే!'

'చెప్పనా?'

'ఆ!'

'నీమొగుడు నల్లమసిబొగ్గు!'

సత్యవతికి ఎక్కడలేని కోపం వొచ్చింది. అందరూ పకపకా నవ్వారు.

'నీమొగుడుమట్టుకు మసిబొగ్గుకాడేం?' అంది సత్యవతి.

ఊరుకోక, సూర్యాకాంతం 'నామొగుడు తెల్లసుద్దముక్క' అంది.

సత్యవతిఒళ్లు మండింది. రివ్వున యింటికి వెళ్లింది. సూర్యాకాంతంమీద కసితీర్చుకోవాలని అనుకుంది. మళ్లీ కొంచెం ఆలోచించుకొని, 'వేళాకోళాని కందిగాని......' అని మనసుకూరడించుకుంది. మళ్లీ కొంతసేపటికి తుపానులో పడవవలె మనసు చిందరవందరయింది. 'అందరిలో నామొగుణ్ని మసిబొగ్గంటుందా?' అని పళ్లు పటపటా కొరికింది. మొగుడికి ఫిర్యాదుచేద్దామని అనుకొంది. మొగుడేం చెయ్యగలడు? తన ఉడుకుమోత్తనానికి తనే ఏడ్చింది. వేడియెక్కిన శరీరం కన్నీళ్లకి కొంచెం చల్లబడింది. మరొక క్షణానికి యేమనుకొందోగాని ఏడ్పు మానివేసింది. సూర్యాకాంతంతో మంచిగా ఉంటే మొగుణ్ని మసిబొగ్గుచెయ్యదని శాంతంపొందింది. వైరంవల్ల లాభం లేదని విహితంగా ఉండాలని నిశ్చయించుకుంది.

ఈమోస్తరుగా పరిపరివిధాలుగా పోయిన మనస్సుని కొంతసేపటికి కట్టిపెట్టుకుంది.

అదిమొదలు సూర్యాకాంతానికి 'తందానతానా' పాట పాడుతూఉండేది. కొన్నాళ్లకి సూర్యాకాంతం, సత్యవతిమీదికి దాడివెడలడం మానుకుంది. 'సంయిఅంటే సంయి' అని ప్రతీపనిలోనూ ఇద్దఱూ ఏకమయేవారు. ఇట్టిస్నేహం ప్రారంభించినతర్వాత వారిద్దరూ ముందుచెప్పినట్టు పొలంగట్టుమీద సభచేసినారు. ఎఱుకలవాళ్ల వేషం వేసికొని యీక్రిందివిధంగా పాట పాడుతూ గోపాలంయింటి పెరటిగుమ్మందగ్గర సంధ్యచీకటిలో పెద్దల్ని అమ్మడానికి నిశ్చయించుకున్నారు.

పెద్దలమ్మా పెద్దలూ
పెద్దపెద్దపెద్దలూ
పెద్దమ్మాయిపెద్దలూ
పెద్దగ్రహారపెద్దలు.

౬

పిల్లలకి భోగిపళ్లు పోద్దామని సూర్యాకాంతాన్ని పేరంటానికి పిలవడానికి వెళ్లింది పెద్దమ్మాయి. ఊళ్లో కడయిల్లు కావడంవల్ల సూర్యాకాంతంయింటికి వెళ్లేసరికి కొంచెం పొద్దుపోయింది. సత్యవతికూడా అక్కడే ఉన్నది. పెద్దమ్మాయిని చూసి పకపకా నవ్వింది.

సూర్యా: 'నవ్వుతానేమిటే సత్యవతీ.' సత్యవతిని చాటుకు పిలిచింది, సూర్యాకాంతం. 'నవ్వుతావేం? పెద్దమ్మాయికి మనం చేసిన గమ్మత్తు తెలియదు' అని కసిరింది. పెద్దమ్మాయిదగ్గరకు వచ్చి, 'పెద్ద లెలాగ ఉన్నారు వదినా? కులాసాగా ఉన్నారా?' అంది. సత్యవతికి నవ్వు ఆగటంలేదు. ప్రక్కగదిలోకి పోయి కడుపుబ్బ నవ్వుతున్నాది గద్దాయిస్తూ, సూర్యాకాంతం, 'ఇంకా చిన్నతనపు చేష్టలు పోలేదు నీకు

సత్యవతీ! ఇంటికి వచ్చిన పెద్దమనిషిని మర్యాద చెయ్యడంలేదుగదా, పై పెచ్చు నవ్వులాటకూడానా?' అని పెద్దమ్మాయివైపు తిరిగి, అతివినయంతో 'మాడు వదినా!' అంది.

'మరచిపోక రండేం. పెద్దల్ని కూడా చూద్దురు గాని' అని కోకిలధ్వనిచేసి బొట్టుపెట్టి వెళ్ళిపోయింది పెద్దమ్మాయి.

ఆయువతులు ముస్తాబై బయల్దేరుటకుపూర్వం, పాలికాపుని సబ్బుబిళ్ల తెమ్మని అగ్రహారపు అంగడికి పంపి, చీరల బీరువా తెరచి, ఏచీర సింగారించడం అని చర్చిస్తున్నారు. మీమాంస యెంతకీ తెగలేదు. గంటసేపయింది. కాని తీర్మానం కుదరలేదు. 'సందడిలో సడేమియ్యా' అన్నట్టు ప్రక్కగదిలో పెట్టె బద్దలగొడుతున్నట్టు చప్పుడు వినవచ్చింది. మరొకక్షణంలో



"ఇంకోక్షణానికి గోపాలంగారి......అని పిలుస్తూ"

వీథిలోనుంచి 'దొంగలు దొంగలు' అని కేకలు వినవచ్చాయి. ఇంకోక్షణానికి గోపాలంగారి పాలికాపువచ్చి 'సూర్యాకాంతంగోరూ, పెద్దమ్మాయిగారి పెద్దల్ని నూస్తారట......' అని పిలుస్తూఉండగా, నిప్పులు వెడల్రక్కుతూ, సూర్యాకాంతం వీథిగుమ్మంలోకి వచ్చి, 'ఏడిసినట్టే వుంది. పెద్దలూ లేదు, పేడబొమ్మలూ లేదు......'అని కసిరి, సుడిగాలివలె గదిలోకి వెళ్ళింది. అక్కడ ఇనుపపెట్టె బద్దలగొట్టి ఉంది. వీథిగుమ్మంలో సబ్బుబిళ్లతోసహా వాలాడు పాలికాపు. సత్యవతి అప్పుడే ఇంటికి వేంచేస్తున్నాది.

౭

రాత్రి రెండఝాముల వేళ. పిల్లలూ, పెద్దలూ గాఢనిద్రలో ఉన్నారు. పెద్దమ్మాయిపడకగదిలోని ఆముదపుదీపం భయంవేస్తున్నట్టు వణకడం ప్రారంభించింది. గడగోడకూడ వణకింది. యజమానిని లేపవలెనని నేలకు ఒరిగి నేలమీద పడి 'దొంగలు' అని కేకవెయ్యడానికి ఊపిరిలేక మెల్లగా చప్పుడుచేసింది. గదిలో ప్రవేశించిన భయంకరరూపులను గాంచి ఆముదపుదీపము కనులుమూసుకుంది. గడ్డిమేటువద్ద ఎడ్లు నిలువబడి దెబ్బలుతిన్నవానివలె అఱచినవి. ఇద్దరు దొంగలు ఆనిశీథపు సమయంలో పెద్దమ్మాయిపడకగది చొచ్చారు. ఇల్లూ వాకిలీ యేకటాకీగా రాత్రిపూట సముద్రంమోస్తరుగా ఉంది. ఆఅంధకారపు సముద్రంలో చంద్రబింబమువలె ప్రకాశిస్తున్నద పెద్దమ్మాయి ముఖము. చెవులకు ఉన్న దుద్దులు నక్షత్రములను తోపించుచున్నవి. ప్రక్కలోని యెడపిల్లడు పాలకోసం కాబోలు, 'అమ్మా!' అని నోరు విప్పాడు. దొంగలకి జాలివేసింది. కాని హృదయం రాయిచేసుకున్నారు. పెద్దమ్మాయిమంచందగ్గరగా వచ్చారు. అక్కడనుంచి పదడుగులు వేసి భర్తఉన్న మంచం సమీపించారు. ఇటూ అటూ ఒత్తిగిల్తూఉన్న గోపాలాన్ని చూసారు. మరిపదడుగులువేసి బోషాణపెట్టె ఉన్న గదిలో ప్రవేశించారు. ఇవతలికి వచ్చారు. లోపలికి వెళ్లారు. భోషాణం భళ్లున పగులగొట్టారు.

గోపాలానికి మెలకువవచ్చింది. దీపం వెలిగించాడు. దొంగలు తలుపు బిడాయించుకున్నారు. బ్రహ్మాండమైన కాగడా వెలిగించి దానివెలుతురులో భోషాణపు అంతరాళంలో ఉన్న నగలపెట్టె తీసారు. గోపాలం వీథిలోకి పరుగెత్తాడు. 'దొంగలబ్బో, దొంగలు' అని గొంతెత్తి అఱచాడు. చీమచిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దంగా ఉంది అగ్రహారం. చెవిదగ్గర గంటమ్రోగించినట్లు, దొంగల చెవులలో 'దొంగలు' అన్న ముక్క ప్రతిధ్వనించింది. దొంగలలో ఒకడు పెరటిగుమ్మంలోకి పరుగెత్తాడు. పెద్దమ్మాయికి మెలకువ వచ్చింది. తలుపులు బార్లా తీసిఉన్నాయి. మంచంమీద గోపాలం కనిపించడం లేదు. దొంగలు పడ్డారనుకుంది. నగలమాట ఆమెమనసుకి తట్టలేదు. పెద్ద వడ్లతట్ట తీసింది. నిద్రపోతూఉన్న చంటికుంకని ప్రక్కతో లేవనెత్తి వడ్లతట్టలో ఉంచింది. నిచ్చెన వేసుకుని అటక యెక్కింది. ఊరగాయలకుండలకు మూలగా తట్టను భద్రపఱచింది. గబగబా మహాలక్ష్మి గదిలోకి వెళ్లి, పెద్దల్ని రెండుచేతులతో తీసుకున్నది. 'పెద్దల్లారా, ఇంటిమర్యాద కాపాడండి. కుమారుని కాపాడండి. భర్త చల్లగా ఉండాలి' అనుకుంటూ అటక యెక్కింది. గదిలో సంజడి విన్నారు దొంగలు. వారి చెవులు నిక్కపొడిచికొనిఉన్నవి. తలుపు తీసుకుని నగలపెట్టెతోసహా అటకకిందకి వచ్చాడు ఒకదొంగ. గదిమూలలు నాలుగూ కలియబారా చూచాడు. పెద్దమ్మాయిచేతిలో పెద్దలు వొణికిపోతున్నారు. ఆవొణికుతో దొంగవాని నెత్తిపై పడ్డారు. దొంగ నిర్ఘాంతపోయి పెట్టె జారవిడిచాడు. ఇంతట్లో వీథిగుమ్మంలో దుడ్డుగఱ్ఱల చప్పుడు వినపడింది. దొంగ దవుడుతీసి, 'పరుగెత్తరోయి బాబో' అంటూ సహాధ్యాయుడుకి పురికొల్పి ఇద్దరూ పెరటిగుమ్మంలోనుంచి పారిపోయారు.

౮

దొంగలు పడ్డప్పటినుంచీ సూర్యాకాంతంమనసు బాగులేదు. నాడు పట్టపగలు నగలుపోయిన రోజు ఆమె మరచిపోదామని ప్రయత్నించినా మరచిపోలేకుండా ఉంది. పూర్వపుధోరణ, మునుపటి హాస్యం, ఆమెవదనంనుంచి తేనెటీగలు విడచిన తేనెపట్టులాగ మాయమయినవి. గోపాలంగారి యింటిలోకూడా దొంగలు పడ్డారన్న ముక్క విన్నది. "నూతనంగా కనుకున్న పిల్లకి బాఱసాల యెలా చేస్తున్నాదా? పెద్దమ్మాయికి విచారమైనా లేదా?" అని ఆమెమనసు సంకోచించినది. సాదాచీర కట్టుకుని సత్యవతిని వెంటబెట్టుకొని గోపాలంగారి యింటికి సాగింది. ఎంతోశోభతో పెద్దమ్మాయి కూతురుబాఱసాలవేడుకలో ఉన్నది. పేరంటాళ్లని చూడగానే ఆమెముఖం కలకలమని కలువమొగ్గవలె నవ్వింది. వారిని ఆహ్వానించింది. 'పెద్దమ్మని చూడండి' అని పుత్రికను రెండుచేతులతో తీసుకువచ్చి చూపించింది. తర్వాత 'నగలజాడ యేమైనా కనిపించినదా?' అన్నది. 'పోయిన సొమ్ము మనది కాదు' అన్నది సూర్యాకాంతం. సత్యవతిచెవిలో యేమో చెప్పి, 'వదినా...తప్పు క్షమించు...' అని పెద్దల ముచ్చట పెద్దలయేరునుంచి, పెద్దల నమ్మినవరకూ పూసగ్రుచ్చినట్లు చెప్పింది. చిఱునగవు నవ్వింది పెద్దమ్మాయి పాలుత్రాగుతూ ఉన్న పుత్రికను వడిలో వేసుకుంది. ముద్దాడినది. 'కన్నతల్లీ, పెద్దమ్మా, ఇంటికి పెద్దదిక్కు నీవే' అని గద్గదస్వరంతో అన్నది.

గోపాలం వీథిగుమ్మం యెక్కాడు. యువతీమణులు లేచి నిలవపడ్డారు. సెలవుతీసికొని సూర్యాకాంతం, సత్యవతి గృహోన్ముఖ లయినారు.